# స్వచ్ఛత

**కథ**

విశాఖపట్నానికి అతి సమీపంలోవుంది మా పల్లెటూరు. ఊరికి చుట్టూ వున్న పచ్చని చేలు, పిల్లకాలువ మీదనించి వచ్చే చల్లని పిల్లగాలులు మనసుకి ఎంతో ఉల్లాసాన్నిస్తుంటాయి.

హైటెక్ సిటీలో క్షణం తీరిక లేకుండా, కలుషిత వాతావరణంలో తిరిగే నన్ను సేదతీర్చి, నాలో అడుగంటుకుపోయిన ఉత్సాహాన్ని, సృజనాత్మకతనూ మళ్లీ రీజనరేట్ చేస్తుంది మా వూరి వాతావరణం. అందుకే సెలవులిచ్చినప్పుడల్లా ఊరికి పరుగెత్తుకుని వచ్చేస్తుంటాను.

కాలవకిరువైపులా వున్న పది ఎకరాల కొబ్బరి తోటంటే నాకెంతో యిష్టం. సెలవుల్లో ఇంటికి వస్తే ఇంటిలో కన్నా తోటలోనే ఎక్కువసేపు గడిపేవాడ్ని.

కాయలతో నిండిన పచ్చని కొబ్బరి చెట్లు, చెట్ల మధ్య అరటితోట చూసే వాళ్లకి అక్కడ్నించి బయటికి రావాలనిపించదు. తోటని అంత గొప్పగా తయారుచేసిన ఒక గొప్ప వ్యక్తి ఒకరున్నారు. ఆయనే రంగయ్య.

తన పదో ఏట నించే రంగయ్య మా తోటలో పనిచేస్తున్నాడు. రంగయ్య అంటే మా ఇంట్లో అందరికీ ముఖ్యంగా నాన్నగారికి చాలా యిష్టం. తోటని తన కన్న కూతురికన్నా ఎక్కువగా చూసుకునే రంగయ్య మాటంటే నాన్నగారికి వేదవాక్కు. వయసు అరవై పై బడుతున్నా మనిషిలో ఎక్కడా ముసలితనపు జాడలు మచ్చుకి కూడా కనిపించవు. పెద్ద, పెద్ద మీసాల్తో, నుదుట కుంకుమ బొట్టుతో చూసేవాళ్లకి భయంకరంగా కనిపించే రంగయ్య మనసు మాత్రం చిన్నపిల్లల మనస్సే! అలుపెరుగని మనిషి. ఎటువంటి భూమినైనా సస్యశ్యామలంగా మార్చే నేర్పరి తనముంది.

''అయ్యా..కాలవకి కుడివైపునున్న తోటలోని కొబ్బరికాయల్ని అమ్మగా వచ్చిన యాభైరెండు వేలు..'' అంటూ చేతిలో నోట్ల కట్టలతో నిలబడ్డాడు రంగయ్య.

చదువుతున్న పేపర్లోంచి తల కూడా పైకి ఎత్తకుండా ''టేబిల్‌మీద వుంచి వెళ్లు'' అన్నారు నాన్నగారు.

''అయ్యా..మీరు ఒకసారి లెక్కపెట్టుకుంటే''

''రంగయ్యా! నువ్వు తీసుకునేటప్పుడు లెక్కబెట్టే కదా తీసుకుని వుంటావు. మళ్లీ నేనెందుకు లెక్కబెట్టడం.''

''అయ్యా, తర్వాత ఈసారి నించి కొబ్బరికాయల్ని అనకాపల్లి పార్టీకి అమ్మొద్దయ్యా''

''అలాగే నీ యిష్టం వచ్చినట్లు చెయ్యి''

''నేను ఎందుకు చెబుతున్నానంటే...'' రంగయ్య ముగించే లోపల నాన్నగారు అందుకుని.

''రంగయ్యా నేను నిన్ను కారణం అడగలేదే! నీకు నచ్చకపోతే వద్దు'' రంగయ్య మీద నాన్నగారి అభిమానం, నమ్మకం అటువంటిది.

రంగయ్య ఇంటికి వస్తే కడుపునిండా భోజనం తినిపించకుండా వదిలిపెట్టదు అమ్మ. కన్నతండ్రి కన్నా ఎక్కువగా కొసరి, కొసరి పెడ్తుంది.

పెద్ద, పెద్ద ముద్దలు పెట్టుకుని, కడుపునిండా తిని ''అమ్మా నేను ఎప్పుడూ గుడికి వెళ్లింది లేదు. గుడిలో అమ్మవారిని చూసింది లేదు గానీ, మీలోనే ఆ అమ్మవారిని చూస్తున్నానమ్మా'' అని రంగయ్య అంటుంటే అమ్మ మొఖం వెయ్యి ఓల్టుల బల్బులా వెలిగిపోతుంది.

ఈసారీ పరీక్షలయిపోయిన వెంటనే ఊరికి వచ్చేసాను. వచ్చిందే తడవుగా తోటలోకి బయలుదేరాను. సాయంత్రం వేళ అవడం వల్ల అరటితోటకి నీళ్లు పెడ్తున్నాడు రంగయ్య.

నేను రావడం దూరం నించే చూసి, చేస్తున్న పనిని ఆపి ఆఘమేఘాల మీద నాదగ్గరకి పరుగెత్తుకుని వచ్చాడు.

''రండి చినబాబు, లీవులిచ్చేసారా? పరీక్షలు బాగా రాసారా? మరీ సన్నంగా అయిపోయారీసారి'' అన్నాడు ఆప్యాయంగా.

''భలేవాడివే! కావాలని చెప్తున్నావుగానీ, పోయిన సారి కన్నా రెండు కిలోలు ఎక్కువైయ్యాను తెలుసా?''

ఇద్దరం మాట్లాడుకుంటూ తోట లోపల వున్న రంగయ్య గుడిసె దగ్గరికి చేరుకున్నాం. ఇంటి ముందు ఏపుగా పెరిగిన మామిడి చెట్టు క్రింద నున్న మంచం మీద కూర్చున్నాను.

''అమ్మా అన్నపూర్ణా. ఒక్కసారి ఇలారా'' నా పక్కనే క్రింద కూర్చుంటూ పిలిచాడు రంగయ్య.

''అన్నపూర్ణా? అదెవరు రంగయ్యా'' అని అడిగాను ఆశ్చర్యంగా.

''నా మనమరాలు బాబు. మొన్నొచ్చిన వరదల్లో నాకూతురూ అల్లుడూ పోయారు. దీన్ని నేను తీసుకుని వచ్చి నా దగ్గరే వుంచుకున్నాను. ఈ వయసైన కాలంలో కొంచెం తోడుగా వుంటుందని బాబు''

ఇంతలో లోపల్నించి ''పిలిచారా తాతయ్యా'' అంటూ ఒక మెరుపుతీగ బయటికి రావడం చూసాను. కొంచెం సేపు గుండాగినట్టయింది. అందమైన కళ్లు, సన్నని నడుము, కొరుక్కు తినాలనిపించే పెదవులు, అన్నింటికన్నా గుమ్మంలో నించి వంగుని వస్తున్నప్పుడు వేసుకున్న బ్లౌజ్ లోనించి కనిపించిన వక్ష సంపద గుళ్లోని శిల్పాలు కూడా తలదించుకునేటట్టుగా వున్నాయి.

''అన్నపూర్ణ, నేను చెప్పాను చూడు చినబాబుగారని ఆయనేనమ్మా ఈయన'' రంగయ్య మాటలతో మళ్లీ స్పృహలోకి వచ్చాను.

''పట్టణంలో చదువుకుంటున్నారు. నేనంటే ప్రాణం'' రంగయ్య తన మనమరాలికి నన్ను పరిచయం చేసాడు. మర్యాదపూర్వకంగా నమస్కరించి ఒక ప్రక్కగా వెళ్లి నిలబడింది అన్నపూర్ణ.

చీకటి పడుతుండగా గుండెల్నిండా అన్నపూర్ణ జ్ఞాపకాలతో ఇంటికి తిరిగి వచ్చాను. రాత్రి అసలు నిద్రపట్టలేదు. కళ్లు మూసినా, తెరిచినా అన్నపూర్ణ గుడిసెలోనించి బయటికి వచ్చేటప్పుడు కనిపించిన దృశ్యమే కళ్లముందు కదలాడసాగింది. నాకెందుకో ఏ దేవకన్యో శాపగ్రస్తురాలై రంగయ్య ఇంటిలో పుట్టిందనిపించింది.

ఏదో ఒక రోజు అన్నపూర్ణని నా కౌగిలిలో బంధించకపోతానా అన్న ఆశతో రోజూ తోటకి వెళ్ళసాగాను.

అన్నపూర్ణ లేత కొబ్బరికాయల్ని కొట్టి ఇచ్చేది. ఒక్కోసారి పనసపండు ఒలిచి తొనల్లో తేనె పోసి తినమనేది. సాయంత్రం వేళల్లో ఇంటికి బయలుదేరేటప్పుడు మల్లెతోటలోని మల్లెపువ్వులనుకోసి మాలగా కూర్చి అమ్మకివ్వమని ఇచ్చేది.

అలా రోజు రోజుకీ అన్నపూర్ణ నాకు దగ్గరవడం ప్రారంభించింది.

ఒకరోజు నేను వెళ్లేసరికి అన్నపూర్ణ ఒక్కర్తే వుంది. తలంటుకున్నట్టుంది. ఎండలో నిలబడి తలారబెట్టుకుంటోంది. నన్ను చూడగానే ''తాతయ్య లేరు చినబాబు. ఎరువులు కొనడానికి టౌను వెళ్లారు'' అంది.

''తాతయ్య గురించి కాదు. అరటి తోట ఎలా వుందో చూసిరమ్మని అమ్మ పంపించింది'' అంటూ అరటితోట వైపు నడవసాగాను.

''ఉండండి బాబు, నేనూ వస్తున్నాను''

తలవెంట్రుకల్ని వదులుగా ముడి వేసుకుని గబగబా వచ్చి నా ముందు నడవసాగింది.

తను ముందు నడుస్తూ వుంటే తన అందం నన్ను పిచ్చివాడ్ని చేసేసింది. అదీ కాకుండా తోటలో వున్న పువ్వుల మీద నించి వచ్చే కమ్మనివాసన నాలోని కోరికలను మరింత రెచ్చగొట్టాయి. గబుక్కున వెళ్లి అన్నపూర్ణని వెనకనించి గట్టిగా వాటేసుకున్నాను.

ఛటుక్కున వెనక్కి తిరిగింది అన్నపూర్ణ.

నా చేతుల్ని నెమ్మదిగా విడిపించుకుని "చినబాబూ..మీరు కూడానా?" అంది.


నేను బదులేమీ చెప్పలేదు. నాకప్పుడు ఆమెని ఎలాగైనా అనుభవించాలన్న కోరిక మాత్రమే నాలోవుంది. మళ్లీ ఆమెని దగ్గరగా లాక్కుని పెదవుల్ని జుర్రుకోబోయాను.

ఆమె కళ్లు ఒక్కసారి మూసి తెరిచింది. కళ్లలోంచి నీళ్లు బయటికి వుబికాయి.

"వద్దు చినబాబు..మీ కుటుంబానికి మీ వల్ల మచ్చరావొద్దు"

"మచ్చా..నాన్సెన్స్..ఈ కాలంలో ఇది సర్వసాధారణం పూర్ణ. ఇందులో తప్పులేదు."

"చిన బాబూ..మీరింత సంస్కారహీనంగా మాట్లాడుతారనుకోలేదు. మా తాతయ్య మీ ఇంటిని ఒక కోవెలకన్నా ఎక్కువగా భావిస్తున్నాడు. మీ అమ్మగారినైతే తన కులదైవమనే నమ్ముతున్నాడు. అటువంటి దేవత కడుపున పుట్టిన మీకు ఇటువంటి నీచమైన బుద్ధులు ఎలా వచ్చాయో అర్థమవడం లేదు చినబాబు" అంది అన్నపూర్ణ చాలా శాంతంగా.




"అన్నపూర్ణా! నువ్వొట్టి పల్లెటూరి మొద్దువని నిరూపించావు. ఇక్కడ మనమిద్దరమే వున్నాం! కొంచెం సేపు జాలీగా వుందామని చెబితే పాపం, పుణ్యం అంటూ మాట్లాడతావేమిటి?" అన్నాను కొంచెం కోపంగా.

"నేను పల్లెటూరి మొద్దునే! చదువుకోనిదాన్నే. చదువుకున్నదయితే ఇలాంటి సందర్భాన్ని వదులుకోదా చినబాబు!"

"వదులు కోదు. అంతేకాదు ఆ తర్వాత కూడా ఏమీ తెలియనట్టే. ఏమీ జరగనట్టే వుంటుంది కూడా"

"అప్పుడు ఇందులో తప్పులేదంటారు?"

"లేదు...లేదు..లేదు"

"అలాగయితే మీ అక్క చదువుకున్నది. పల్లెటూరి మొద్దు అసలే కాదు. టౌన్లో హాస్టల్లో వుండి చదువుకుంటుంది. ఆమె కూడా నాలాగే మంచి వయసులో వుంది. టౌన్లో ఇలాంటి సందర్భం దొరికితే ఆహా! ఎంత మంచి అవకాశం వచ్చింది అంటూ ఎవడితోనైనా పడుకుని వస్తుందన్నమాట."

అక్కయ్య గురించి మాట్లాడేసరికి నాకు కోపం ఆగలేదు.

"ఎంత పొగరే నీకు! ఏం మాట్లాడుతున్నావో? ఎవరి గురించి మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా?"

"ఏమిటి చినబాబు. మీ అక్క గురించి మాట్లాడేసరికి అంతలా కోపం పొడుకు వచ్చింది. మీ అక్కయ్య డబ్బుల్లో పుట్టింది. డబ్బుల్తో పెరిగింది. ఎలాంటి తప్పులూ చెయ్యకుండా స్వచ్ఛంగా, మచ్చలేనిదిగా ఇంకొకరి ఇంటికి వెళ్ళాలి. మేము బీదవాళ్లం. మీలాంటి డబ్బులున్న వాళ్లందరికి కొంచెం సేపు సుఖాన్నందించి మీరిచ్చే అణాపైసల్తో జరిగింది మరిచిపోవాలి. అంతేనా చినబాబు" ఎక్కడా తొట్రుపాటు లేకుండా మాట్లాడుతుంద అన్నపూర్ణ.

"నేనూ మీ అక్కలాంటి ఆడపిల్లనే చినబాబు. బీద


వసంతకుమార్ సూరిశెట్టి


రికంలో పుట్టినంత మాత్రాన మాలాంటి వాళ్లకి మనసు, మానం, మర్యాదలూ వుండవనుకోకండి. పెళ్లి చేసుకుని ఒకరి ఇంటికి వెళ్లేటప్పుడు శీలం చెడిన దానిలా కాకుండా స్వచ్ఛమైన మల్లెపూవులా వెళ్లాలనుకోవడం తప్పా చెప్పండి చినబాబు?"

అన్నపూర్ణ నోటి నుంచి వచ్చే ఒక్కొక్క మాటా నా గుండెల్ని చీల్చి, చెండాడి నాలోని మృగత్వాన్ని నామరూపాలు లేకుండా చేసేసాయి.

'ఛ! ఎలాంటి తప్పు చేసాను? రంగయ్యకిగాని తెలిస్తే ప్రాణాల్తో వుంటాడా? నా చదువు, సంస్కారం అన్నీ నా కామాంధకారంలో కనిపించకుండా పోయాయి కదా!'

ఛటుక్కున అన్నపూర్ణ చేతులు పట్టుకుని "నన్ను క్షమించు అన్నపూర్ణ. ఒక పెద్ద ప్రమాదం నించి నన్ను కాపాడావు. చాలా థాంక్సు" అంటూ ఆమె కళ్లల్లోకి చూడలేక గబ, గబా ఇంటివైపు నడవసాగాను.

★